ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 సంచిక : 02 అక్టోబర్ 2007

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

గణపవరం ...... 28-08-2007

పాలకొల్లు ....... 04-09-2007

అయి భీమవరం 09-09-2007

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747



దిll 28-08-2007న గణపవరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల సందర్భముగా ప్రవచిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-08-2007, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం అందరం మంచిపనులు చేయలేము. లక్షలాది మందిలో మంచిపనులు చేసేవారు, ఇతరులకు సహాయ సహకారములు చేసేవారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. దానికి శక్తి ఉండాలి, సమర్థత ఉండాలి, ధైర్యం ఉండాలి. మనం అందరం మంచిపనులు చేయలేకపోయినా ఆ మంచిపనులు చేసేవారిని గౌరవించటం నేర్చుకొంటే సరిపోతుంది. కాని మంచిపనులు చేసేవారిని గౌరవించటం కూడా మనకు చేతకావటం లేదు, అదీ మన పరిస్థితి. మంచి పనులు చేసేవారిని మనం గౌరవిస్తూ ఉంటే, వారిపట్ల మనకు పూజ్యభావన ఉంటే వారు చేసుకొన్న పుణ్యంలో కొంతభాగం భగవంతుడు మనకు పంచిపెడతాడు. ఎవరైనా మంచిపని చేస్తారు అనుకోండి, దానిని కళ్ళతోటి చూసి, చెవులతోటి విని మనం ఆనందిస్తాము అనుకోండి, ఆ ఆనందానికి కూడా భగవంతుడు వాటా పంచిపెడతాడు. మనకు ఒక దేహం ఉంది, దేహం ఉంటే సంసారం వచ్చింది. జనరల్‌గా మనం చేసేది ఏమిటి అంటే దేహ అవసరాలను తీర్చుకోవటం, కోరికలు తీర్చుకోవటం, మనకు సంబంధించినంతవరకు అదే జీవితం, స్మశానానికి వెళ్ళేవరకు మనకు ఇదే పని. అహంభావన లేకుండా, దేహాభిమానం లేకుండా మనిషి ఉండడు. దేహాభిమానం తగ్గించుకోవటానికి మనం ఏదైనా సాధన చేస్తున్నామా అంటే ఏమీ చేయటం లేదు. మీకు వెయ్యికోట్ల డబ్బు ఉన్నా మీకు దేహాభిమానం ఉన్నంతకాలం దుఃఖం, అశాంతి మిమ్మల్ని విడిచిపెట్టవు, మీరు ఎక్కడికి వెళ్ళినా నరకం మీ కూడా వస్తుంది. ఒకవేళ మనలను మంచిపరిస్థితులలో కూర్చోబెట్టినా దేహాభిమానం ఎక్కువగా ఉంటే అక్కడ నరకాన్ని మనమే సృష్టించుకొంటాము. దేహాభిమానం ప్రతీమనిషినీ పీడించేస్తుంది. ప్రతీమనిషి నేను, నేను అంటాడు కదా, ఆ నేను దేహంతో తాదాత్మ్యం పొందిఉంటుంది. శరీరానికి వచ్చే రోగాలకంటే, మనస్సులో వచ్చే అశాంతే మనలను ఎక్కువగా పీడిస్తుంది.

మనం ఏదైనా మంచిపని చేసినా చిత్తశుద్ధికోసం చేయటం లేదు, ఈశ్వరార్పణ బుద్ధితో చేయటం లేదు. ఈశ్వరుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అనే ధ్యాసే మనకు లేదు. నిజంగా మనం చేసేది నిష్కామకర్మ అయితే, వ్యక్తిభావన లేకుండా మనం పనిచేస్తూ ఉంటే, కర్మఫలకాంక్ష లేకుండా మనం పనిచేస్తూ ఉంటే మన అహంభావన నశించాలి. కాని మన అహంభావన నశించటంలేదు, ఆరోజుకారోజు పెరుగుతోంది. మహాత్ములు, పెద్దలు

అందరూ మాయను జయించండి, మాయను జయించండి అంటే ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి, ఇల్లు విడిచిపెట్టి మనలను ఎక్కడికో పారిపోమని కాదు. ఈ సమాజంలో ఉంటూనే భగవంతుడు ఏపని అయితే నీకు కేటాయించాడో ఆ పనిని నిర్మలంగా, నిశ్చలంగా, గొప్పలు లేకుండా హృదయపూర్వకంగా చెయ్యి. మనం ఎక్కడికి వెళ్ళినా సమాజం ఉంటుంది, పంచభూతాలు ఉంటాయి, రాగద్వేషాలు ఉంటాయి. సమాజంలో మంచి చెడు రెండూ ఉంటాయి. సమాజంలో చెడ్డవారు కూడా అవసరం. ఎందుచేతనంటే మంచివారిలో ఉన్న మంచితనం పెరగటానికి, చెడ్డవారు లేకపోతే మంచివారిలో ఉన్న మంచితనం పెరగదు. ఒక రావణాసురుడు లేకపోతే రాముడి యొక్క గొప్పతనం మనకు తెలియదు. నీ బంధానికి, మోక్షానికి మనస్సే కారణం. అందుచేత మనస్సును బాగుచేసుకోవాలి. నువ్వు చెప్పినట్లుగా నీ మనస్సు వినాలి కాని మనస్సు చెప్పినట్లుగా నువ్వు వినకూడదు. భగవద్గీతలో భగవంతుడు చెప్పినది ప్రమాణం ఎందుచేతనంటే అది సత్యం. అయితే మన జీవితవిధానం అలా ఉంటోందా అని లోచూపుతో మనం పరిశీలన చేసుకోవాలి. అలా చూసుకొంటూ ఉంటే మనస్సు నెమ్మదిగా పల్చబడి నశిస్తుంది. మనస్సు నశిస్తే మనం నశిస్తాము అని మనందరకు భయం కాని గాఢనిద్రలో మనస్సు గొడవ లేకుండా మనం సుఖంగా ఉన్నాము కదా. సినిమా తీసేటప్పుడు లైట్లు అన్నీ హీరోమీద, యాక్టర్లమీద ఫోకస్ చేస్తారు వారు బాగా కనబడటం కోసం అలా ఫోకస్ చేస్తారు. మనం ఏమి చెయ్యాలి అంటే మనకు ఉన్న తెలివితేటలను, శక్తిని అంతా మనకు ఉన్న బలహీనతలమీద, అలవాట్ల మీద ఫోకస్ చెయ్యాలి. అలా చేయటం వలన వాటి బలం ఎంత ఉంది, అవి మనలను ఎలా పీడిస్తున్నాయి అనేది మనకు తెలుస్తుంది, అప్పుడు వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేయాలి. మనం చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే మన అలవాట్లలో నుండి బయటకు రావటానికి మనం ఏమీ ప్రయత్నం చేయటం లేదు. కృత్రిమ గౌరవాల కోసం పాటుపడుతూ మన శక్తిని వృథా చేసుకొంటున్నాము. ఇలా గొప్పలకోసం, గౌరవాలకోసం పాటుపడుతూ ఉంటే మనకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది.

కృష్ణుడి గురించి చెపుతూ ఆయన నోటినిండా వెన్నపూస, హృదయం నిండా ఆనందం అని చెపుతారు. నోటినిండా వెన్నపూస అంటే నోటినిండా తియ్యగా ఉంటాడు అని. మనం నోరు మెదిపితే ఆ మాట వలన ఇతరులకు శాంతి కలగాలి, ఆనందం కలగాలి కాని మనం నోరు విప్పితే ఇతరులకు అశాంతి, దుఃఖం. ఎందుచేతనంటే మన నోటిలో తియ్యదనం లేదు మన నోటిలో ఉన్నది చేదు, విషం. కృష్ణుడి హృదయంలో ఉన్నది ఆనందం కాబట్టి ఆయన లోకానికి ఆనందాన్ని పంచిపెట్టాడు. మన హృదయంలో ఉన్నది అశాంతి కాబట్టి

మనం అశాంతిని పంచిపెడతాము. మనలను మనం ప్రేమించుకొంటాము, ఇతరులను ద్వేషిస్తాము. అద్వైతం అంటే ఏమీ లేదు నన్ను నేను ఎలా ప్రేమించుకొంటానో అలా మిమ్మల్ని నేను ప్రేమించగలిగితే, నన్ను నేను ద్వేషించుకోను కదా అలాగే నేను మిమ్మల్ని ద్వేషించకుండా ఉండగలిగితే అప్పడు అద్వైతానుభవం కలుగుతుంది, ఆనందస్థితి కలుగుతుంది. మన హృదయంలో ఒక సత్యం ఉంది, ఆ సత్యమే నారాయణుడు, అదే ఈశ్వరుడు. ప్రారబ్ధాన్ని బట్టి ప్రతీదేహాన్ని నడిపేవాడు ఆయనే, ఈ సృష్టికి యజమాని ఆయనే, ఆయనకు శరణాగతి చేస్తేనేగాని మనకు శాంతి రాదు, ఆనందం రాదు అనే బుద్ధి మనకు రావటం లేదు. ఒక మనిషి నీకు వేరుగా కనిపిస్తున్నంతకాలం వాడిని చూసి నీకు భయం, నిన్ను చూస్తే వాడికి భయం కలుగుతుంది. కోరిక, భయం, అశాంతి ఇదంతా ద్వైతంలో నుండే వస్తోంది, నువ్వు వేరు నేను వేరు అనే బేధభావనలోనుండే వస్తోంది. నీటిలో ఉన్న దుంగ అది ఎంతలావుగా ఉందో మనకు కనబడదు, పైభాగం మాత్రమే మనకు కనిపిస్తుంది, నీటిలో ఉన్న భాగం మనకు కనబడదు అలాగే మన మనస్సులో ఉన్న పైభాగం మాత్రమే మనకు కనబడుతోంది, లోపల భాగంలో ఉన్న గొడవలు మనకు కనబడటం లేదు. ఆపైభాగం చూసి ఏదో మంచి వారమని, చెడ్డవారమని మన గురించి మనం తీర్పులు చెప్పేసుకొంటున్నాము. లోపల భాగంలో ఏ వాసనలు ఉన్నాయో, ఏ బలహీనతలు ఉన్నాయో మనకు తెలియటం లేదు. మనం కోటను జయించాలంటే బయట కాపలా ఉన్న నలుగురిని చంపినంతమాత్రంచేత ఆకోట వశం అవ్వదు. లోపల నుండి ఇంకా సైన్యం వస్తూ ఉంటుంది, రాజు ఎక్కడో లోపల ఉంటాడు. ఆ సైన్యం అందరినీ చంపి, రాజుగారిని కూడా చంపితేగాని ఆకోట మనకు వశం కాదు. మన మనస్సు కూడా అటువంటిదే. ఏవో పైకి కనబడే కొన్ని కోరికలను పోగొట్టుకొంటే సరిపోదు, లోపలఉన్న వాసనలు బయటకు వస్తూ ఉంటాయి. నువ్వు సాధన చేసేటప్పడు లోపలఉన్న మురికి అంతా బయటకు వస్తూ ఉంటుంది. మనస్సులో ఉన్న వాసనలు పూర్తిగా నశిస్తేగాని మనస్సు నశించదు.

రఘువంశంలో కాళిదాసు ఏమని చెప్పాడు అంటే నీ ఇంద్రియాలకు ఎన్ని ఆకర్షణలు కావాలో అన్ని ఆకర్షణలు నీకు ఎదురుగా ఉండాలి, ఒక్క ఆకర్షణ కూడా నీ ఇంద్రియాలను ఆకర్షించకూడదు అప్పడు నీవు ఇంద్రియాలను జయించినట్లు అని చెప్పాడు. భోగ వస్తువులు ఎదురుగా లేవు అనుకో, మరల ఎప్పడైనా భోగవస్తువు వస్తే ఎంజాయ్ చేద్దాము అనే తలంపు నీకు ఉంటే అది ఎప్పటికైనా ప్రమాదం, దానిని నీవు అతిక్రమించవలసిందే. ప్రాణం పోయేటప్పడు మనం అనుకొన్నది రాదు, మనకు లోపల చాలా తలంపులు ఉంటాయి,

మనకు ఏదైతే బాగా ఇష్టమో ఆ తలంపే ప్రాణం పోయేటప్పుడు బయటకు వస్తుంది, ఆ చివరి తలంపును బట్టి పునర్జన్మ నిర్ణయింపబడుతుంది. మనం చనిపోయాక రామేశ్వరంలో పుట్టాలి, గణపవరంలో పుట్టాలి అంటే అది మన ఇష్టంకాదు, మనం స్వతంత్రులం కాదు. చివరి తలంపును బట్టి మనం ఏ లోకానికి వెళ్ళాలి, ఏ దేహం వాడికి ఇవ్వాలి అనేది ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. ఎన్నో జన్మలలో ఎంతో పుణ్యం చేస్తేనేగాని ఈ మానవదేహం మనకు రాదు. మన హృదయంలో సత్యం ఉంది అని భగవంతుడు చెపుతున్నాడు. ఆయన చెప్పేది ప్రమాణం, అది మనం నమ్మాలి. దేవుడికి అబద్ధం చెప్పవలసిన పని లేదు. ఆయనకు మన ఓట్లు అక్కరలేదు, నోట్లు అక్కరలేదు. అంతా ఆయనే. అంతా ఆయనే అయినప్పుడు ఆయనకు ఏమి కావాలి, ఏమీ అక్కరలేదు. ఆయన మన దగ్గరనుండి వాంఛించేది ఏమీ లేదు. భగవంతుడికి నెరవేరవలసిన కోరికలు అంటూ ఏమీలేవు, అందుకే ఆయన దేవుడు.

మనకు తెలియని విషయం వదిలేయండి. మనకు మనస్సు తెలుస్తోంది, దేహం తెలుస్తోంది, ఈ రెండింటినీ నియమించుకోవాలి. శరీరంతో మంచిపనులు చేయాలి, అదీ గొప్పలకోసం, గౌరవాల కోసం చేయకూడదు, ఈశ్వరప్రీత్యర్థం చేయాలి. నువ్వు సమాజాన్ని అంతా ఉద్ధరించేయనక్కరలేదు, ఒక్కడికి సహాయ సహకారములు అందించినా సరిపోతుంది. నా శరీరానికి రోగం వస్తే వైద్యం చేయించుకొంటాను, అది ప్రజాసేవ అనుకోను. మీ శరీరానికి ఏదైనా రోగం వస్తే నేను వైద్యం చేయిస్తే ప్రజాసేవ చేస్తున్నాను అంటాను. అదొక పెద్ద మాయ. నా శరీరానికి రోగం వచ్చి డబ్బు ఖర్చుపెట్టినప్పుడు ప్రజాసేవ అని ఎందుకు అనుకోవటంలేదు? నీ శరీరానికి వస్తే ఎందుకు అనుకొంటున్నాను? అంటే నా శరీరాన్ని నేను ఎలా చూసుకొంటున్నానో, నీ శరీరాన్ని నేను అలా చూసుకోవటం లేదు. అప్పుడు మాయ ప్రవేశిస్తుంది, అంటే ద్వైతభావన వచ్చింది, ఆ వేరుభావనలో నుండే అన్ని అరిష్టాలు వస్తాయి. మనం పాడైపోవటానికి కారణం ఇదే. నా శరీరానికి రోగం వచ్చినప్పుడు డబ్బు ఖర్చుపెట్టి నేను ఏదో ఉపకారం చేసుకొన్నాను అనుకోవటంలేదు, అదే నీ శరీరానికి రోగం వస్తే దానికోసం డబ్బు ఖర్చుపెట్టి నిన్ను ఏదో ఉద్ధరించాను అంటాను. నిన్ను ఉద్ధరించటం మాట ఎలా ఉన్నా ఇలా అనుకోవటం వలన నీకు పదిపైసలు సాయం చేసి 90 పైసలు నేను లోపల కుళ్ళిపోతాను. ఈ పదిపైసలకు నాకు పుణ్యం వస్తే రావచ్చును, ఈ పుణ్యం అనుభవిస్తే పోతుంది. అనుకొనేవాడు ఒకడు లోపల ఉన్నాడు కదా, ఇలా అనుకోవటం వలన చిత్తశుద్ధిరాదు, ఈశ్వరుని దయ రాదు, నేను చేసిన మంచిపని నన్ను సుఖపెట్టదు. నేను చేసిన మంచి పని నన్ను సుఖపెట్టకపోతే, నేను మాట్లాడిన మంచిమాట నన్ను సుఖపెట్టకపోతే ఆ పనులు ఎందుకు, ఆ మాటలు ఎందుకు,

దేనికోసం ఇదంతా? మనం గుడికి వెళ్లినప్పుడు హారతిపళ్లెంలో డబ్బులు వేస్తాము, అది దానం చేసాము అనుకోము. అదే ఇతరులకు పది పైసలు ఇస్తే దానం చేసాము అనుకొంటాము. అంటే దేవుడిని ఇతరులలో మనం చూడలేకపోతున్నాము. దేవుని దగ్గర చేసింది పూజ అనుకొంటాము, ఇక్కడేమో ఉపకారం చేసాము అనుకొంటాము. ఇది కూడా పూజే అని అనుకొంటే దేవుని అనుగ్రహం మనకు కలుగుతుంది. గుడిలో ఉన్న దేవుడు ఇక్కడ కూడా అంతర్యామిగా ఉన్నాడు. బయట ఉన్న దేవుడు, లోపల ఉన్న దేవుడు వేరుకాదు. ఉన్నది ఒక్కడే. నువ్వు డబ్బు ఎలా సంపాదించుకొంటున్నావో, అధికారం ఎలా సంపాదించుకొంటున్నావో, గౌరవం ఎలా సంపాదించుకొంటున్నావో అలాగ భగవంతుని యొక్క అనుగ్రహం, ఆయన యొక్క దయను నీవు సంపాదించుకొంటే నువ్వు అడగటంతోటి సంబంధం లేకుండా భగవంతుడు నిన్ను మోక్షంతో అలంకరిస్తాడు.

నీ శరీరయాత్రకు సరిపడ పని చేసుకో. మిగిలిన టైమును, మిగిలిన డబ్బును ఇతరుల క్షేమం కోసం వినియోగించు. నీవు చేసేది గొప్పలకోసం చేయకూడదు. నువ్వు నుయ్యి తవ్వించటం మంచిదే, అది నీళ్ళు ఎక్కడ దొరకటం లేదో అక్కడ తవ్వండి అంతేగాని గంగానది ప్రక్కన నుయ్యి తవ్వటం ఎందుకు. మీరు చేసేపని శాంతిగా చెయ్యాలి, నిర్మలంగా చెయ్యాలి, మన క్షేమం మనం ఎలా కోరుకొంటామో అలాగే ఇతరుల క్షేమం కోరి చెయ్యాలి. అంతేగాని గొప్పలకోసం చేస్తే వల్లకాటివరకు వేలాదిమంది రావచ్చు, తరువాత జీవితం సున్న. నిన్ను నరకానికి పంపేస్తారు. ఏమిటి నా కూడా వేలాది మంది వచ్చారు, నన్ను నరకానికి పంపుతున్నారు అంటే నువ్వు చేసిన పనులు గొప్పలకోసం చేసావు, దానికోసం వేలాదిమంది వచ్చారు, ఆ భాగం అయిపోయింది, ఈ భాగం అనుభవించమంటారు. మీకు లోకం కావాలా, దేవుడు కావాలా? మనకు మోక్షం ఇచ్చేది లోకంకాదు, మనకు మోక్షం ఇచ్చేది భగవంతుడు. నీ కుడిచెయ్యి చేసేపని, నీ ఎడమచెయ్యికి తెలియకూడదు అని ఏసుక్రీస్తు చెప్పాడు. భగవద్గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే కోరిక, కోపము, భయము ఈ మూడింటిని విడిచిపెట్టటానికి ప్రయత్నం చేయమని చెప్పాడు, నీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలము యజ్ఞము, దానము, తపస్సు ఈ మూడింటిని విడిచిపెట్టవద్దు అని చెప్పాడు. మనం స్వార్థం లేకుండా చేస్తే ప్రతీ పని యజ్ఞముతో సమానము. నీ మనోదేహములను ఒక ప్రక్కన పెట్టి పని పని కోసమే చేసేది యజ్ఞము. కీర్తి వస్తుందని, గౌరవం వస్తుందని మనం పనిచేస్తూ ఉంటే అది యజ్ఞం కాదు. మాకు అదంటే ఇష్టం, ఇదంటే ఇష్టం అని అంటారు. ఈ లోకంలో ఏ వస్తుజాలాన్ని చూసి నీవు ఇష్టపడుతున్నావో, దేనిని చూసి నీవు మమకారం పెంచుకొంటున్నావో అవి అన్నీ కూడా నీకు

దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఉపనిషత్‌లలో దానం గురించి ఏమనిచెప్పారు అంటే నువ్వు ఎవరికైనా పది రూపాయలు ఇవ్వాలి అంటే వారిని నీ ఇంటికి రప్పించకు, నువ్వు వారింటికి వెళ్ళు. నేను వారికి ఇస్తున్నాను, వారు పుచ్చుకొంటున్నారు అని కాకుండా వారు తీసుకొంటారో లేదో అనే అనుమానంతోటి, గౌరవంతోటి, ప్రేమతోటి ఇచ్చింది దానం కాని వారికి ఏదో ఒక బస్తా ధాన్యం పడేసాను అంటే అది దానం కాదు. అసలు దానం చేసే పద్ధతే మనకు తెలియదు. నువ్వు ఇచ్చేది ఏడుస్తూ ఇస్తూ ఉంటే ఇంక వాడు ఏమి సుఖపడతాడు. తపస్సు అంటే భోజనాలు మానేసి కూర్చోవటంకాదు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండటం, నియమంగా ఉండటం, ఎంతవరకు అవసరమో అంతవరకు మాట్లాడటం అంటే అవసరం లేనిది మాట్లాడకూడదు. అవసరమైనది విడిచిపెట్టకూడదు. కొంతమంది జీవకోటి ప్రవర్తన ఎలా ఉంటుందో గాంధీగారు చెప్పారు. ఎక్కడ ఎప్పుడు ఏపని చేయకూడదో, ఏమాట మాట్లాడకూడదో అప్పుడు అక్కడ ఆ పనిచేస్తూ ఉంటారు, ఆ మాట మాట్లాడుతూ ఉంటారు అని చెప్పారు. నేను ఏదో సత్యం గురించి చెపుతున్నాను అని నీ ఇష్టం వచ్చినట్లు చెప్పకూడదు, ప్రీతిగా ప్రేమగా ఇతరులకు హితవు కలిగించేలా చెప్పాలి. అతినిద్ర పనికిరాదు, అతిగా నిద్రపోతే సాధనకు టైము తగ్గిపోతుంది.

మనందరినీ పీడించేది దేహాభిమానం. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే ఉబ్బిపోతారు, ఎవరైనా తిడితే కుంగిపోతారు, వీటి అన్నింటికి దేహాభిమానం కారణం. మీకు దేహాభిమానం లేదు అనుకోండి, మీకు రోడ్డు మీద విరోధులు కనిపించినా, మీ శ్రేయస్సుకోరేవారు కనిపించినా, మీరు ఎవరి మొఖాలు చూసినా ఒకే రకంగా ఉంటారు. మీ మనస్సులో ఏమీ వికారం రాదు, అదీ తపస్సు. అంటే. మనందేహాభిమానం తగ్గించేపనులు చేయాలి, దేహాభిమానం తగ్గించే మాటలు మాట్లాడాలి. నీ మనోనాశనానికి ఉపయోగపడే ఏపనిచేసినా అది తపస్సులో భాగమే. నీకు ముక్కులో గాలి తిరుగుతున్నంతవరకు ఒకవేళ నీకు జ్ఞానం వచ్చేసినా ఇవి మూడూ విడిచిపెట్టవద్దు అని చెప్పాడు. జ్ఞానం వచ్చేస్తే ఇంక ఇవి ఆచరించటం ఎందుకు అంటే నీకు అక్కరలేదు కాని ఇతరులకు ఆదర్శం కోసం వాటిని విడిచిపెట్టవద్దు. కృష్ణుడికి నోటినిండా వెన్నపూస, హృదయం నిండా ఆనందం, చేతినిండా పని. వాడు దేవుడు, దేవదేవుడు. గోపికలు కృష్ణుడిని అనుసరించేవారు, మూసేసేవారు అంటే అక్కడ దేహానికి సంబంధించిన విషయంకాదు. ఇక్కడ బాగా అర్థం చేసుకోండి గోపికల హృదయంలో ఏ సత్యం అయితే ఉందో, ఏ తీయదనం అయితే ఉందో అదే కృష్ణుడిరూపంలో వచ్చింది కాబట్టి ఇది అక్కడ ఎంజాయ్ చేస్తున్నారు అంటే వారిని వారే ఎంజాయ్ చేస్తున్నారు. గోపికలు అందరూ ఋషులు. అది తెలిసినవారు ధన్యులు. కృష్ణుడు భగవద్గీత చెప్పాడు అంటే ఆయన సమాధిస్థితిలో ఉండి,

దేవుడై చెప్పాడు. వ్యాసుడు భాగవతం వ్రాసాడు అంటే ఇంద్రియాలకు అతీతంగా, మనస్సుకు అతీతంగా సమాధిస్థితిలో ఉండి వ్రాసాడు. అది సమాధిభాష, దైవభాష. అది మన మనస్సుకు అందనిభాష, వాక్కుకు అందని భాష అని తెలిసినవారు ధన్యులు. ఆ సమాధిభాషలో వారు ఆనందాన్ని, శాంతిని జుర్రుకొని తన్మయత్వం పొంది కొంత బయటకు కక్కితే దానిని మనం అనుభవిస్తున్నాము. వారి హృదయం ఆనందంతో నిండిపోయి, ఆ ఆనందం, శాంతిని వారు అనుభవించి, ఆ ఆనందం ఇంద్రియాల ద్వారా, మనస్సు ద్వారా బయటకు వచ్చేస్తూ ఉంటే దానిని మనం అనుభవిస్తున్నాము. ఈ చిన్న తలకాయలు, ఇంకో గంటలో ఏమి జరుగుతుందో తెలియని తలకాయలు, ఆ గోడ ప్రక్కన ఏముందో తెలియని తలకాయలు వీరు భగవంతుడిని విమర్శించటం, భాగవతాన్ని విమర్శించటం, భగవద్గీతను విమర్శించటం. ఇంకో విషయం గుర్తు పెట్టుకోండి. మన శరీరంలో ఓపిక ఉన్నంతసేపు పని చేసుకోవాలి, మీకు ఇంటి దగ్గర పనులు అయిపోయినాయి అనుకోండి, మనస్సును ఎప్పడూ ఖాళీగా ఉంచవద్దు. మీకు ఇష్టమైన నామాన్ని స్మరించుకోండి, ధ్యానం చేసుకోండి, సద్గ్రంథ పఠనం, సత్పురుషుల సహవాసం చేయండి. అంతేగాని మనస్సును ఖాళీగా ఉంచవద్దు. ఎప్పడైతే మనస్సు ఖాళీగా ఉందో అప్పడు కామం బయలుదేరుతుంది. కష్టపడి పనిచేసేవాడికంటే ఏ పనీపాటూ లేనివాడే ఎక్కువ విసుగ్గా, చిరాకుగా, కోపంగా ఉంటాడు. మనస్సు ఖాళీగా ఉంటే పాడు తలంపులు వస్తూ ఉంటాయి. అందుచేత దైవచింతనతో మీ మనస్సును నింపుకోండి.

భాగవతం చెప్పినవాడు, భగవద్గీత చెప్పినవాడు మనలాంటి వారుకాదు. అది భగవంతుడే చెప్పాడు, ఆత్మే చెప్పింది అది మనం గుర్తుపెట్టుకోవాలి. గీతలో చెప్పినమాటకు విరుద్ధంగా మీ మనస్సు ఉంది అనుకోండి అప్పడు మీ మనస్సును ఒక ప్రక్కనపెట్టేసి భగవంతుడు చెప్పినమాటను హితవు చేసుకొని దానిని స్వీకరించటానికి ప్రయత్నం చేయాలి. భగవంతుడు చెప్పినట్లు నడుచుకోవాలి, ఆయన చెప్పినట్లు జీవించటమే తపస్సు అంటున్నారు, భగవంతుడు చెప్పినమాట అసలు మాకు అర్థమవ్వాలి కదా అని భక్తులు అడుగుతున్నారు. సమాధిలో ఉండి చెప్పాడు అంటున్నారు కదా మరి మేము అహంకారంతో ఉంటే ఆ మాటలు మాకు ఎలా అర్థమవుతాయి, అర్థం అవ్వకుండా ఆచరించాలనే బుద్ధి మాకు ఎలా కలుగుతుంది అని అడుగుతున్నారు. మీ పాడుబుద్ధికి ఈ మాటలు అర్థం కావని, ఇటువంటి అనుమానాలు వస్తాయని ఆయనకు తెలుసు అందుచేత ఆయనే గీతలో సమాధానం చెప్పాడు. నేను చెప్పిన మాటలు మీకు అర్థమైనా, అర్థమవ్వకపోయినా నేను వద్దని చెప్పిన పనిని మీకు ఇష్టమైనా మానేయండి, నేను చెయ్యమని చెప్పిన పనిని మీకు ఇష్టంలేకపోయినా చెయ్యండి. మీ ఇష్టాయిష్టాలను

ప్రక్కన పెట్టండి. మీకు లోకంలో ఏవో ప్రేమలు ఉన్నాయికదా, అవి దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఆ ప్రేమను నావైపు మళ్ళించండి. భగవంతుడు మనలాంటి వాడే అని అనుకోవద్దు. ఆయన కళ్యాణగుణాలను, ఆయన వైభవాన్ని గుర్తించటం నేర్చుకోండి. ఇక్కడ భగవంతుడు ఏమనిచెపుతున్నాడు అంటే ఆయన నామాన్ని స్మరించుకొంటూ, ఆయనను ధ్యానం చేసుకొంటూ, ఆయనకు ఇష్టం అయిన పనులు మీరు చేస్తూ ఉంటే ఆయన చెప్పిన మాటలు అర్థమయ్యేబుద్ధిని మీకు ప్రసాదిస్తాను అని చెపుతున్నాడు. సత్కర్మ చేసేవాడికి మంచి మనస్సు వస్తుంది, మంచి మనస్సు వచ్చిన వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఎవడికైతే ఆత్మజ్ఞానం కలిగిందో వాడికి మోక్షం వస్తుంది. అంటే పనిని బట్టి మనస్సు, మనస్సునుబట్టి జ్ఞానం, జ్ఞానాన్ని బట్టి మోక్షం వస్తుంది. మంచిపనులు చేస్తూ ఉంటే ఎవరైనా మిమ్మల్ని మెచ్చుకోవచ్చు, అది అంతా వదిలేయండి, మీ మొఖం అటుతిప్పవద్దు. పని పని కోసమే చేయండి, అలా మంచి పనులు చేయటం వలన మంచి మనస్సు వస్తుంది. మంచి మనస్సు జ్ఞానాన్ని తీసుకొనివస్తుంది. మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా ఎట్టిపరిస్థితులలోను సమానబుద్ధిని విడిచిపెట్టవద్దు. నిన్ను నీవు ఎలా ప్రేమించుకొంటున్నావో అలాగ ఇతరులను ప్రేమించు. నిన్ను నీవు ద్వేషించుకోవు కదా అలాగ ఇతరులను కూడా ద్వేషించవద్దు.

మనం అందరం చేసే పనులు ఏమిటి అంటే దేహం యొక్క అవసరాలు తీర్చుకోవటం, కోరికలు తీర్చుకోవటం, అహంకారానికి మేత ఎక్కడ దొరుకుతుందో అక్కడకు పోయి కూర్చోవటం, కృత్రిమగౌరవాల కోసం పరుగెత్తటం ఇలా జీవితాన్ని పాడుచేసుకొంటున్నాము. అసలు మన మొఖం భగవంతుడివైపు తిరగటం లేదు. భగవంతుడి యొక్క దయను సంపాదించటానికి ఎవరూ ప్రయత్నం చేయటం లేదు. ఏవో మంచిపనులు చేస్తున్నాము అండీ మంచిజన్మలు వస్తాయి అంటారు. ఆ మంచిజన్మలు ఎవరికీ అహంకారానికే. అసలు మనస్సుకు లోచూపు రావటంలేదు. మంచిజన్మలు సంపాదించటం కాదు మనం భగవంతుడి యొక్క అనుగ్రహాన్ని సంపాదించాలి. ఆయన అనుగ్రహం ఎప్పుడైతే వచ్చిందో శాశ్వతమైన సుఖంతో, ఆనందంతో మనలను కప్పుతాడు. ఆయన అనుగ్రహం సంపాదించటానికి మనలను మనం నియమించుకోవాలి, మనస్సును క్రమశిక్షణలో పెట్టాలి. మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు, మనస్సును మచ్చిక చేసుకొని భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు అని మనస్సుకు నచ్చచెప్పి వాడి దగ్గరకు తీసుకొని వెళ్ళటమే యోగం. భగవంతుడి తాలుక సుఖం, ఆనందం మనస్సుకు రుచి చూపిస్తూ ఉంటే అది నెమ్మదిగా హృదయంవైపుకు ప్రయాణించి, హృదయంలో లయమవుతుంది. మనస్సుపోతే నీవుపోవు, నువ్వు ఏదిగా

ఉన్నావో అది నీకు వ్యక్తమవుతుంది. డబ్బు సంపాదించటానికి ఒక మనిషి ఎన్ని రకాలుగా ప్రయత్నం చేస్తాడో అలాగ నీవు అన్ని విధములుగా ప్రయత్నం చేసి అది భక్తి యోగం అవ్వవచ్చు, కర్మయోగం అవ్వవచ్చు, ఎన్ని విధములుగా సాధన చేసే అవకాశం ఉందో నీవు అన్ని విధములుగా సాధనచేసి భగవంతుని అనుగ్రహం సంపాదించు. భగవంతుడి దయను సంపాదిస్తే అన్నీ సాధ్యమే. భగవంతుడు మనలను అడుగుతున్నాడు ఇది ఎంత స్వీట్‌గా ఉందో చూడండి. మీకు ఇష్టాలు ఉండవచ్చు, అయిష్టాలు ఉండవచ్చు, వాటిని ఒక ప్రక్కన పెట్టండి. నా ఇష్టాన్ని మీ ఇష్టంగా చేసుకోండి చాలు మీరు బాగుపడతారు అని చెపుతున్నాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-09-2007, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు కృష్ణాష్టమి అంటే కృష్ణుడు జన్మించిన రోజు. ఈరోజు జన్మించాడు అంటే శరీరం ధరించిన వాడివలె కనిపించాడు. భగవద్గీతలో వాసుదేవస్వామి ఒకమాట చెప్పారు. మీరు మోక్షం పొందటానికి పెద్దకష్టపడనక్కరలేదు. నాజన్మరహస్యం, నాకర్మరహస్యం నీకు తెలిస్తే మోక్షం వచ్చేస్తుంది అని చెప్పాడు. నీకు అంటే అర్జునుడికనే కాదు ఎవరికి అర్థమైనా వారికి మోక్షం వస్తుంది. ఆయన జన్మరహస్యం అంటే భగవంతుడు అసలు పుట్టడు, పుట్టినవాడి వలె కనిపిస్తాడు. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, ముసలిది అవుతుంది, చనిపోతుంది. పుట్టిన దానికి చావు ఉంటుంది కాని పుట్టనిదానికి చావు ఏమిటి? భగవంతుడికి పుట్టుకలేదు, చావులేదు, వికారములేదు. భగవంతుడికి అసలు జన్మంటూ లేదు. జన్మించినవాడివలె, దేహంధరించినవాడివలె కనిపిస్తాడు. శుకమహర్షి పరీక్షిత్తుకు భాగవతం చెపుతాడు. భాగవతం చెప్పటం ముగిసాక పరీక్షిత్తుతో ఇక నేను వెళ్ళివస్తాను, ఒకటి రెండు రోజులలో తక్షకుడు వచ్చి నిన్ను కరిచేస్తాడు, నీ శరీరం చనిపోతుంది. వారం రోజులు నువ్వు చాలా శ్రద్ధగా మహాపురాణం అయిన భాగవతం విన్నావు. భాగవతం శ్రద్ధగా శ్రవణం చేయటం వలన నీకు పశుబుద్ధి పోయింది, ఆత్మబుద్ధి కలిగింది అని చెప్పాడు. ఇప్పుడు మనం అందరం మనుషులమే, పశువులంకాదు. కాని శుకుడు పరీక్షిత్తుకు ఏమని చెప్పాడు అంటే శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అనుకొనేవాడు ప్రతీవాడు పశువే అని చెప్పాడు. ఆత్మ పుట్టదు, శరీరం పుడుతుంది. ప్రతీవాడు తాను పుట్టనివాడే కాని శరీరం పట్ల నేను అనేబుద్ధి ఉండటం వలన పుట్టాను అనుకొంటాడు. నేను పుట్టాను అనుకొనేవాడు ప్రతీవాడు శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు, అది పశుబుద్ధి. శరీరం ఉండగా

పశుబుద్ధిని పోగొట్టుకొని ఆత్మబుద్ధిని ఎవడైతే సంపాదించాడో, వాడికి శరీరం మరణించేటప్పడు తాను మరణించటం లేదు అని, తాను మరణరహితుడనని అనే అనుభవం కలుగుతుంది, వాడే జ్ఞాని. జ్ఞాని అంటే పుస్తకాలు చదవటం వలన వచ్చే పాండిత్యం కాదు, ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నది ఉన్నట్లుగా ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడే జ్ఞాని. శరీరం మరణించినప్పడు తాను మరణించటం లేదు, తాను ఎప్పడూ ఉంటాను అనే సంగతి తెలిస్తే వాడు భయరహితుడు అవుతాడు. నా కర్మరహస్యం తెలుసుకొన్న మీరు బాగుపడతారు అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడికి మనలాగ సొంతపనులు అంటూ లేవు. ధర్మాన్ని స్థాపించటానికి అంటే దుష్టులను శిక్షించటానికి, భక్తులను రక్షించటానికి ఒక శరీరం ధరించివస్తాడు కాని ప్రత్యేకంగా ఆయనకు సొంతపని ఏమీ లేదు. కృష్ణుడు కర్మఫలకాంక్ష లేనివాడు. కృష్ణుడికి హృదయంనిండా ఆనందం, నోటినిండా తీపి, చేతినిండా సత్కర్మ, నిష్కామకర్మ. ఎటువంటి సత్కర్మ అవతారపురుషులు చేస్తారు అంటే అసలు మన సంసారాలే మనం నడపలేక పోతున్నాము, భగవంతుడు చేసేపనికి ఈ ప్రపంచం చిన్నదిగా కనిపిస్తుంది. మనం బలహీనులం, బద్ధకస్తులం, సోమరితనానికి అలవాటుపడి ఉన్నాము కాబట్టి చిన్నచిన్న సంసారాలు మోయటం కూడా కష్టంగా ఉంది, వండుకొని తినటమే భారంగా ఉంది, కూర్చొంటే నిలబడలేకపోతున్నాము. కాని భగవంతుడు పనిచేయటానికి ఈ సృష్టి సరిపోదు, వాడికి టైర్‌అవ్వటం అంటూ లేదు, వాడు చేసినా చేయనివాడితో సమానం. పనియందు కర్తృత్వబుద్ధి పెట్టుకొన్నివాడిని నేను ఇష్టపడనువయ్యా అర్జునా అని పరమాత్మ చెప్పాడు. ఏదో పనిచేసి నేను అది సాధించాను, ఇది సాధించాను అని ఇలా చెప్పకొనేవారిని చూసి నేను ఇష్టపడను. వారు నాకు భక్తులు కాదు, వారు నాలో ఐక్యం అవ్వరు సరికదా సమీపానికి కూడా రాలేరు అని పరమాత్మ చెప్పాడు.

భగవంతుడి అవతారాలలో రెండు అవతారాలు ముఖ్యం. 1 రామావతారం. 2. కృష్ణావతారం. ఈ రెండు అవతారాలు పరిపూర్ణమైన అవతారాలు. అయితే ఇద్దరికీ తేడా ఏమిటి అంటే రాముడు ప్రతీదీ తాను చేసి చూపించాడు, కృష్ణుడు చేసి చూపించకుండా తాను ఎవరినైతే ఎన్నుకొన్నాడో వారికి చెప్పి, వారికి చేసే శక్తిని ఇచ్చి, వారిచేత చేయించాడు, తనకు ఏమీ తెలియనట్లు, సంబంధం లేనట్లు తామరాకుమీద నీటిబొట్టులాగ అంటకుండా ఉన్నాడు. చంద్రుడు శరీరానికి చల్లదనాన్ని ఇస్తాడు. ఆత్మజ్ఞానం మనస్సుకు చల్లదనాన్ని ఇస్తుంది అంటే మనస్సుకు శాంతిని ఇస్తుంది. ప్రకృతిబుద్ధితో ఆలోచిస్తూ ఉంటే భగవంతుడు మనకు అర్థంకాడు. పరమపవిత్రుడికి ఈశ్వరుడు తన హృదయంలో దర్శనమిస్తాడు. ప్రకృతిబుద్ధితో ఉన్న మనకు భగవంతుడు అందడు కాబట్టి ఆయన లేడు అని మనకు

అనిపిస్తుంది. మన బుద్ధికి అందని విషయాలు అన్నీ అబద్ధాలు అనుకొంటాము, మనం అంత బుద్ధిమంతులం. నువ్వు చావులేని సత్త్వదార్థమే కాని చనిపోయే శరీరంతో తాదాత్మ్యం పొందుతున్నావు, ఇదే మాయ. మనం ఏదైతే అవునో అది కాదు అనుకొంటున్నాము, ఏదైతే కాదో అది అవును అనుకొంటున్నాము. ఉన్నదానిని లేదు అనుకొంటున్నాము. లేనిదానిని ఉంది అనుకొంటున్నాము. మనకు శ్రేయస్సు కలుగజేసే దానిని శ్రేయస్సు కలుగజేయదు అనుకొంటున్నాము, శ్రేయస్సు దేనివలన కలుగదో అది శ్రేయస్సు కలుగజేస్తుంది అనుకొంటున్నాము, ఇలా ఉంది మన పరిస్థితి.

భగవంతుడు చేసేది కర్తలేని కర్మ. ఆయన ఏ పని చేసినా జీవకోటికి జ్ఞానోదయం కలుగజేయటం కోసమే చేస్తాడు. భగవంతుడు పూర్ణకాముడు, ఆయనకు నెరవేరవలసిన కోరిక అంటూ ఏమీ లేదు. మనకు జన్మలు ఎందుకు వస్తున్నాయి అంటే మనం స్వార్థంతో పనిచేస్తాము. మనకు భగవంతుడు పరమార్థం కాదు. మనకు స్వార్థమే పరమార్థం. మనం కోరికతో పనిచేస్తాము, స్వార్థాన్ని సంతృప్తి పరచుకోవటానికి పనిచేస్తాము, ఒకోసారి ఇష్టంతో, ఒకోసారి అయిష్టంతో పనిచేస్తాము. ఇష్టం ఉంటే ఉపకారం చేస్తాము, అయిష్టం ఉంటే అపకారం చేస్తాము. కాని ఇవి రెండూ మనలను బంధిస్తున్నాయి అనే సంగతి మన బుద్ధికి అందటం లేదు. బుద్ధిమంతుడు, వివేకవంతుడు, తపోబలం ఉన్నవాడు ఏమి చేస్తాడు అంటే ఇక్కడ శరీరాన్ని ఎలా విడిచిపెట్టి వెళ్ళిపోతాడో అలాగే వాడు చేసిన పాపాన్నే కాదు పుణ్యాన్ని కూడా ఈ లోకంలో విడిచిపెట్టి వెళ్ళిపోతాడు అని పరమాత్మ గీతలో చెప్పాడు. పని పనికోసమే చేసేవాడు బుద్ధిమంతుడు. అక్కడ అవసరం అనుకొంటే చేస్తాడు అంతేగాని కోరికతో ఏమీ చేయడు, ఆ పనిచేస్తే గౌరవం వస్తుందని అసలే చెయ్యడు. మనం కోరికవల్ల పనిచేస్తాము, దానివలన వాసనలు పడతాయి. కోరికతో చేసే ప్రతీకర్మ మనలను బంధిస్తుంది. భగవద్గీతకు వ్యాఖ్యానం రాస్తూ ఒక మహర్షి అద్భుతమైన రహస్యం చెప్పాడు. మంచివాడు చెడ్డవారితో స్నేహం చేస్తే ఏదైనా గొడవవస్తే మంచివాడిని ఆహుతిచేస్తారు, చెడ్డవారు తప్పకొంటారు. మంచివాడికంటే చెడ్డవాడికి కుయుక్తి ఎక్కువగా ఉంటుంది. చెడ్డవారు మంచివారితో స్నేహం చేస్తే చెడ్డవారు చనిపోరు, మంచివారిని చంపేస్తారు. వారు వెనకాల కుట్రపన్ని మంచివారిని తెరమీద నుంచోపెడతారు. అలాగే భారతయుద్ధంలో భీష్ముడు, ద్రోణాచార్యుడు ముందు ఆహుతి అయిపోయారు. మనం కోరికమీద కర్మ చేస్తాము. కర్మ చేసి ఫలం కోరుకొంటాము, ఆ ఫలం వస్తుంది, దానిని అనుభవించటానికి శరీరం ఉండాలి కదా. కోరిక వలన కర్మ, కర్మ వలన పునర్జన్మ, పునర్జన్మ వలన దుఃఖం. దేహం

వచ్చిన తరువాత వాడు ఎన్ని సంవత్సరాలు బతికినా, దుఃఖం అంటే ఎలా ఉంటుందో తెలియకుండా నేను బతికాను అని చెప్పినవాడు ఎవడూ లేడు. శరీరం వచ్చిందా ఆ మనిషికి దుఃఖం వచ్చి తీరుతుంది, ఏ రూపంలో వస్తుందో చెప్పలేము. శరీరం వస్తే లోకం వస్తుంది. లోకంలో ఏదో కర్మ చేస్తాడు. వాడికి వ్యక్తిభావన ఉంటుంది గాని సమిష్టిభావన వాడికి ఉండదు. వ్యక్తిభావనతో చేయటం వలన కర్మ వాడిని చుట్టుకొంటుంది. దేహాత్మబుద్ధి ఉన్నవాడు వాడు ఎంతటివాడైనా వాడికి ఎంతధనం ఉన్నా వాడిని దుఃఖం విడిచిపెట్టదు, ఇది చట్టం.

కృష్ణుడి విషయంలో అందరూ ఆక్షేపించేది ఏమిటి అంటే గోపికలు ఏదో వాడిని చుట్టేసుకున్నారు అని. ఆరవ సంవత్సరం పిల్లవాడికి కామం ఏమిటి? వాడు బృందావనం వచ్చేటప్పటికి ఆరవ సంవత్సరం పిల్లవాడు. వాడు గోపికలను చుట్టేసుకోవడం ఏమిటి? అది కాదు. రామావతారంలో ఉండగా ఏమి చేసేవాడు అంటే వాడు దైవాంశ సంభూతుడే అయినా మామూలు మనిషిలాగ ఉండేవాడు. నువ్వు దేవుడితో సమానం అని ఎవరైనా చెపితేనేగాని ఆయనకు తెలిసేదికాదు. ఆయన అరణ్యవాసం చేసేటప్పుడు అక్కడ ఉన్న మహర్షులను, యోగులను కలిసి వారికి నమస్కరించి నాలుగు మంచి మాటలు చెప్పండి అని వారిని అడిగేవాడు. కింద దుమ్ము అవి ఉంటే మనం పాదనమస్కారములు పెట్టము. రాముడు అలాకాదు అరణ్యంలో మహర్షులను కలిసినప్పుడు పాదనమస్కారాలు చేసేవాడు. అప్పుడు మహర్షులు రాముడిని దగ్గరకు తీసుకొని కౌగలించుకొనేవారు. ఆయన పరమాత్మ కదా అలా ఋషులు ఆయనను కౌగలించుకొన్నప్పుడు పరమానందం పొందేవారు. ఈ ఆనందాన్ని ఎప్పుడూ ప్రసాదించమని ఋషులు అడిగారు.ఈ జన్మలో సాధ్యంకాదు, నేను పని మీద వెళుతున్నాను, ఒకరోజు మీ ఆశ్రమంలో ఉంటాను, ఎప్పుడూ ఇక్కడ ఉండలేను అంటాడు. తరువాత ఈ మహర్షులే గోపికలుగా వచ్చి కృష్ణుడిని కౌగిలించుకొని వారు ఆనందాన్ని అనుభవించారు. అప్పటికి ఆయన వయస్సు ఆరు సంవత్సరాలు. ఏదో మానవులు ప్రకృతిబుద్ధితో కౌగిలించుకొనే కౌగిలింతలు కాదు అవి. నీవు, నేను అనే బేధబుద్ధి లేకుండా కౌగిలించుకొంటే కొబ్బరిచెట్టును కౌగిలించుకొంటే ఎంతో స్త్రీని కౌగిలించుకొన్నా అంతే. ప్రకృతిబుద్ధి ఉన్న మీకా ఇది అర్థమయ్యేది. భేదబుద్ధి ఉంటే కదా అక్కడ కామం ఉదయించటానికి. కృష్ణుడు అతీంద్రియుడు అంటే ఇంద్రియాలు ఉన్నా లేనివాడితో సమానము. నీవు, నేను అనే భేదబుద్ధి లేనివాడిని స్త్రీలు కౌగిలించుకొన్నా వాడికి ఏమీ వికారం రాదు. ప్రకృతిని దాటి వెళితేనే గాని ఈ వైభవం మనకు తెలియదు. పూర్వం

యుగాలమాట వదిలెయ్యండి, ఎక్కడో రాముడు కృష్ణుడు మాట వదిలెయ్యండి, శ్రీకృష్ణచైతన్య ఎంత జితేంద్రియుడు అంటే వాడి నాలుకమీద పంచదారవేస్తే మరల ఆ పంచదార అంతా మనం వెనక్కి లాగేస్తే అందులో ఒక్క పలుకు కూడా తడవదు, వాడు శ్రీకృష్ణచైతన్య. మనకు ఎక్కడైనా జిన్ను కనిపిస్తే, స్వీటు కనిపిస్తే నోరంతా లాలాజలం. ఇటువంటి మనం వారి మీద తీర్పులు చెప్పటం. ఇంద్రుడికి గర్వభంగం చేయటం కోసం ఆయన చిటికినవేలితో కొండను వారం రోజులు ఎత్తి ఉంచాడు పరమాత్మ. అప్పటికి ఆయనకు అయిదు సంవత్సరాలు. ఒక మనిషికి గర్వం పెరుగుతోంది అనుకోండి, భగవంతుడు ఏదో రూపంలో వాడికి గర్వభంగం చేసేస్తాడు. అది ఏ రూపంలో చేస్తాడు, ఎలా చేస్తాడు, ఎక్కడ చేస్తాడు అనేది మనం చెప్పలేము. గర్వభంగం ఎందుకు చేస్తాడు అంటే వాడిమీద కోపం వలన కాదు, వాడికి వినయం నేర్పటంకోసం, వాడు బాగుపడటంకోసం అలా చేస్తాడు. ఎదుటివారు సుఖపడాలని నీ జీవితంలో ఒక్క పని అయినా చేసావా? పని పనికోసమే నువ్వు చేస్తున్నావా?

రాధ గోపికల్లో ఒక గోపిక, కృష్ణుడు బృందావనాన్ని విడిచిపెట్టివెళ్ళేటప్పుడు నువ్వు మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నావు, నీ పిల్లనగ్రోవిని నాకిచ్చేయి అంటుంది రాధ. అప్పుడు కృష్ణుడు పిల్లనగ్రోవిని రాధకు ఇచ్చి వెళ్ళిపోతాడు. కృష్ణుడులేని వియోగాన్ని తట్టుకోవటానికి రాధ ఏమిచేసేది అంటే పిల్లనగ్రోవి ద్వారా కృష్ణుడి యొక్క సంగీతాన్ని మిగతా గోపికలకు వినిపించేది. ఉత్తర ప్రదేశ్‌లో కృష్ణుడికి ఎంత గౌరవం ఇస్తారో, రాధకు అంతే గౌరవం ఇస్తారు. కారణం ఏమిటి అంటే రాధ చూస్తే కృష్ణుడినే చూస్తూ, కృష్ణుడినే స్మరిస్తూ, కృష్ణుడి మాటలే వింటూ అలా జీవించటం వలన కృష్ణుడే రాధ, రాధే కృష్ణుడు అనే స్థాయికి వచ్చేసింది. కృష్ణుడి పట్ల ఉన్న సజీవమైన ప్రేమకు రాధ గుర్తు. భగవంతుడి పట్ల మనకు ఉన్న ప్రేమను, అనుబంధాన్ని, ఇష్టాన్ని భక్తి అంటారు. మీకంటే ఉన్నతస్థాయిలో ఉన్నవాడిమీద మీకు ప్రేమ ఉంటే దానిని భక్తి అంటారు, మీకంటే తక్కువ స్థాయిలో ఉన్న జీవకోటి మీద మీరు ప్రేమ చూపిస్తూ ఉంటే దానిని దయ అంటారు. మనం ఇంకొకటి నేర్చుకోవాలి. మన శక్తికిమించిన పనులు చేయకూడదు. మనకు ఎంతైతే యోగ్యత ఉందో, ఎంతైతే అర్హత ఉందో అంతవరకే పనులు చేయాలి. మనకంటే శక్తిమంతులతోటి వైరం పనికిరాదు. టైము వచ్చేవరకు వేచి ఉండాలి, కాని కంగారుపడి వారితో కలబడకూడదు. భీష్ముడు ధర్మరాజుకు నీతులు చెప్పేటప్పుడు ఒక చెట్టు గురించి చెప్పాడు. ఆ చెట్టు మంచిదే, మంచి ఫలాలు ఇస్తుంది, మంచి ఆకులతో ఉంటుంది అందుచేత అందరూ ఆ చెట్టును పొగిడేవారు, అలా పొగడటం వలన దానికి గర్వం వచ్చింది. దానికి గర్వభంగం చేయటంకోసం నారదుడు వచ్చాడు. నారదుడు ఆ చెట్టు దగ్గరకు వచ్చి నీవు

చాలాబలంగా ఉన్నావు, మంచికాయలు కాస్తున్నావు, మంచి ఆకులు ఉన్నాయి అని అంటూ బహుశా వాయుదేవుడు కూడా నిన్నేమీ చేయలేడు అంటాడు. గాలివాన నన్నేమి చేస్తుంది, వాయుదేవుడు నన్నేమిచేస్తాడు అంటుంది చెట్టు. నారదుడు వాయుదేవుడి దగ్గరకు వెళ్ళి ఫలానా చెట్టు నిన్ను కూడా లెక్కచేయను అంటోంది అని చెపుతాడు. వాయుదేవుడికి కోపం వచ్చింది, నన్ను లెక్కచేయవా అయితే రేపు వస్తాను నీ పని చూస్తాను అంటాడు. అప్పుడు ఆచెట్టుకు భయం వేసింది. శుభ్రంగా బతుకుతున్నాను, నా ఆకులు అన్నీ రాలగొట్టేస్తాడేమో, నా ప్రాణం కూడా తీస్తాడేమో అని మరుసటిరోజు ఆయన వచ్చేటప్పటికి ఆకులు దులుపేసుకొని, పళ్ళన్నీ పడగొట్టేసుకొని మోడులా అయిపోయింది. ఏమిటి ఇలా మోడులా అయిపోయావు అంటే నువ్వు రాకుండానే నాకు గర్వభంగం అయిపోయింది. నువ్వు వస్తే నా ప్రాణం తోడేస్తావేమోనని నేను ముందుగానే మోడయి ఉన్నాను. నువ్వు వెళ్ళిపోయిన తరువాత మరల ఆకులు తొడుగుతానులే అంది. అంటే దాని అర్థం ఏమిటి అంటే నీకంటే ఎక్కువ శక్తిమంతులతో కంగారుపడి నువ్వు విరోధం పెట్టుకోవద్దు అని చెప్పటం. ఒకవేళ వాడు నిజంగా దుర్మార్గుడు అనుకో. నువ్వు కొంతటైము తీసుకో, వాడిని అణిచివేసే టైము వచ్చేవరకు నువ్వు వెయిట్ చెయ్యి, ఒకమాట మీరు గుండెలో దాచుకోండి. మనకు ఆకలివేస్తోంది అనుకోండి అన్నం తింటే ఆకలి తగ్గిపోతుంది, మీకు ఎవరినైనా చూడాలని ఉంది అనుకోండి, వెళ్ళి చూసి వస్తే చూసాము అనే సంతృప్తి ఉంటుంది. మీకు సీతాఫలాలు తినాలని ఉంది అనుకోండి. నాలుగుపళ్ళు తినేసిన తరువాత ఇంక మనస్సు వాటి మీదకు వెళ్ళదు కాని భయం ఇలా తగ్గదు, ఇది జ్ఞాపకం పెట్టుకోండి. ఆత్మజ్ఞానం కలిగేవరకూ, భేదబుద్ధి నశించే వరకు ఎవడినీ భయం విడిచిపెట్టదు. అధికారం ఉన్నవాడికి అధికారం పోతుందేమోనని భయం, ధనవంతుడికి ధనం పోతుందేమోనని భయం, ఆరోగ్యవంతుడికి అనారోగ్యం వస్తుందేమోనని భయం, పాముని చూస్తే భయం, దుర్మార్గుడిని చూస్తే భయం. స్వరూపజ్ఞానం కలిగేవరకూ, ఏ వస్తువులో అయితే భయం లేదో ఆ వస్తువు తాలుక అనుభవం కలిగేవరకూ ఏ జీవుడిని భయం విడిచిపెట్టదు. కోరికను విడిచిపెట్టు, కోపాన్ని విడిచిపెట్టు, భయాన్ని విడిచిపెట్టు ఎందుచేతనంటే ఇవి అన్నీ దుఃఖాన్ని తీసుకొని వస్తాయి అందుచేత వీటిని తగ్గించుకో అని పరమాత్మ చెపుతున్నాడు. భగవంతుడి పట్ల మనకు ఉన్న భక్తి నిజమైతే మనకు ఉన్న దేహాత్మబుద్ధి నశించేవరకు భక్తి మనలను తీసుకొని పోతుంది, మనలో ఉన్న దోషాలు, బలహీనతలు మనకు తెలియకుండానే రాలిపోతాయి. భగవంతుడిపట్ల విశ్వాసం పెరిగేకొలది, ఆయనను సమీపించేకొలది మనలో ఉన్న అజ్ఞానం నశిస్తుంది. నువ్వు ఎవరిపట్ల వైరం పెట్టుకోవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు.

నువ్వు ఎవరిపట్ల అయినా వైరం పెట్టుకొంటే నీకు రోజూ వారే జ్ఞాపకం వస్తారు, పరమాత్మ జ్ఞాపకం రాడు.

ఈశ్వరుడిపట్ల ఎంత భక్తిగా ఉన్నావో, నీ చేతిలో ఉన్న పనిపట్ల కూడా అంతే భక్తిగా ఉండు. పని దొంగలుగా ఉండవద్దు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేయి. మీకు ఏదైనా అవకాశం ఉంటే సమాజానికి ఉపయోగపడే పని కొంత చేయండి. సమాజరూపంలో ఉన్నవాడు కూడా పరమేశ్వరుడే. ఈశ్వరునిదయ సంపాదించటానికి పని చేయండి. అంతేగాని గొప్పలకోసం, గౌరవాలకోసం పనులు చేయవద్దు. ఇలా పనిచేస్తూ ఉంటే నీవు దండలు వేయనక్కరలేదు, గుంజీలు తీయనక్కరలేదు, నీచేత నేను ఆరాధించబడుతున్నాను అని పరమాత్మ చెపుతున్నాడు. నువ్వు ఏమనుకొంటున్నావు అంటే నా బొమ్మ దగ్గర నాలుగు పుష్పాలు పెడితేనే ఆరాధిస్తున్నాను అనుకొంటున్నావు. నువ్వు నిష్కామకర్మ చేసినా ఆ కర్మచేత కూడా భగవంతుడు ఆరాధింపబడతాడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారికి ఏదైనా కలిసివస్తే పొంగిపోతారు, కలిసిరాలేదు అనుకోండి ఏడుస్తూ కూర్చొంటారు. ఈ రెండూ భక్తుడికి పనికిరావు అంటున్నాడు. నీకు ఏదైనా కలిసివచ్చినా, అది కలిసిరాకముందు ఎలా ఉన్నావో తరువాత కూడా అంత నిర్వికారంగా ఉండాలి. నీకు పది వంకాయలు ఉన్నాయి అనుకో రెండు వంకాయలు ఇతరులతో షేర్ చేసుకో. పెద్ద ధర్మాలు, దానాలు అక్కరలేదు. నీకు ఉన్న సంపదను కొంత ఇతరులతో షేర్ చేసుకో. మనం వంకాయలు ఇతరులకు ఇచ్చినా పది వంకాయలలో ఏరి ఏరి పనికిరానివి ఇతరులకు ఇస్తాము. ఈ పాడైపోయిన వంకాయలు అక్కడ పరమాత్మ తింటున్నాడు అని మనకు తెలియటం లేదు. ఎక్కడో మోక్షందాక వెళ్ళద్దు. నీకున్న దానిని ఇతరులతో షేరింగ్ వలన భగవంతుని అనుగ్రహం కలుగుతుంది, జీవించి ఉండగానే పరమానందాన్ని పొందుతావు. మనం చేయవలసింది ఏమిటి అంటే ఈ లోకానికి పరలోకానికి సమన్వయం సంపాదించుకోవాలి. ఈ లోకంలో మన పని మనం శ్రద్ధగా చేస్తూ, ట్రెనింగ్ పొందుతూ ఉత్తమలోకాన్ని పొందాలి అంతేగాని అస్తమానూ పరలోకం గురించి ఆలోచిస్తూ ఈ లోకంలో సోమరితనానికి అలవాటు పడితే చివరికి అదీ రాదు, ఇదీ రాదు, ఉభయ భ్రష్టత్వంపడుతుంది. ఎక్కడో ఏదో ఉంది అని ఊహించుకోవద్దు, వాస్తవపరిస్థితులను విడిచిపెట్టవద్దు. వాస్తవ పరిస్థితులను అంగీకరిస్తూ ఇందులో పొందవలసిన ట్రెనింగ్ పొందుతూ జ్ఞానం సంపాదించి, పరమార్థాన్ని పొందు. అయితే జ్ఞానం కూడా భక్తి మిశ్రితమై ఉండాలి.

మీరు ఏదైనా కర్మ చేస్తూ ఉంటే జ్ఞానం ఉండాలి, భక్తి ఉండాలి. మీరు ఏదైనా పనిచేస్తూ ఉంటే ఆ పని ఎలా చెయ్యాలో తెలిసి ఉండాలి, అది జ్ఞానం. చేసేపని విశ్వాసంగా చెయ్యాలి, అది భక్తి. ఇన్ని రకాలుగా సమకూడితేనే మీ పనికి సౌందర్యం వస్తుంది, మీకు ఆనందం వస్తుంది, ఆ పని కలకాలం నిలబడుతుంది. మీరు చేసే పని ద్వారా భగవంతుడి అనుగ్రహం సంపాదించాలి. భగవంతుడి అనుగ్రహం సంపాదిస్తే మనకు ఎప్పుడు ఏది ఎలా ప్రసాదించాలో ఆయనే ప్రసాదిస్తాడు. ఒక మనిషి మీద మీకు గౌరవం ఉండవచ్చు. అలాగని ఇంకో మనిషిని అగౌరవపరచకూడదు. మనకు ఏదో గురువు అంటే ఇష్టం అనుకోండి, ఆ గురువు ముందు కృష్ణుడు తక్కువ, రాముడు తక్కువ అనుకొంటాము, అదో పాడుబుద్ధి. అవతారపురుషులను మనం అగౌరవపరచకూడదు. భగవంతుడు మనకు ఎంతకాలం అయితే ఆయుర్థాయం ఇచ్చాడో అంతవరకూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీకు ఉన్న డబ్బుకంటే, చదువుకంటే, అధికారంకంటే ఆయుర్థాయం గొప్పది. ఎందుకు ఆయుర్దాయం గొప్పది అనుకొంటున్నాను అంటే మీకు అంగబలం, అర్థబలం అన్నీ ఉన్నాయి అనుకో 20 సం॥లు వచ్చేసరికి చనిపోయారు అనుకో. ఇవి అన్నీ మీకు దేనికి ఉపయోగపడవు. ముక్కులో గాలి బయటకుపోయాక మీకు ఎన్ని ఉన్నా ప్రయోజనం లేదు, అందుచేత వీటికంటే ఆయుర్థాయం గొప్పది. అందుచేత భగవంతుడు ఎంతవరకు మనకు ఆయుర్థాయం ఇచ్చాడో అంతవరకు భగవంతుడి నామాన్ని జపించుకొంటూ, ఆయన గుణాలను కీర్తించుకొంటూ, మనం చేసేపని ప్రేమగా ప్రీతిగా చేస్తూ చివరి శ్వాస వరకు ఇలా జీవితాన్ని గడపాలిగాని ప్రాణం ఎప్పుడుపోతుందా అని కనిపెట్టుకొని ఉండకూడదు. బుద్ధిమంతుడు అయినవాడు చనిపోయినవారి గురించి దుఃఖపడడు, బతికి ఉన్నవారి గురించి వీరు ఎప్పుడు చనిపోతారు అని కనిపెట్టుకొని ఉండడు. ఎవరో చనిపోతే మీకు 10 ఎకరాలు కలిసివస్తాయి అని, ఆ పది ఎకరాల కోసం వాడి ప్రాణాలు పోవాలని అనుకోకూడదు, అలా ఉంటే చనిపోయాక మీకు పాడులోకాలు వస్తాయి. అందుచేత మనకు వచ్చే ప్రతీ తలంపులోనూ జాగ్రత్తగా ఉండాలి. నీ గురించి నీవు ఆలోచించుకోవటం మానివేసి, నిరంతరం నన్ను స్మరిస్తూ ఉంటే, నన్ను ధ్యానిస్తూ ఉంటే నీ యోగక్షేమాలు చూసే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ. పైన ఆకాశం ఉంది, కింద భూమి ఉంది. ఈ భూమి, ఆకాశం కలిసిపోయి ఐక్యం అయినట్లు మనకు కనిపిస్తూ ఉంటే ఎంత గొప్ప దృశ్యం ఇది, ఎంత వండర్‌ఫుల్‌గా ఉంది అనుకొంటాము. రాధాకృష్ణుల కౌగిలి అంత వండర్‌ఫుల్‌గా ఉంటుంది. అక్కడ దేహవాసన లేదు, అది లౌకికం కాదు, అలౌకికం. ఆ దేహం తాను కాదని రాధకు తెలుసు, ఆ దేహంతాను కాదని కృష్ణుడికి తెలుసు. ఉన్నది ఒక్కటే వస్తువు. అందుచేత ఆనందం

ఆనందాన్ని కౌగిలించుకొంటోంది, శాంతి శాంతిని కౌగిలించుకొంటోంది. అది మనకు అర్థంకాక పెడఅర్థాలు తీస్తున్నాము. వారిది డివైన్ లవ్, రోజులు క్షణాలకింద వెళ్ళిపోయేవి. కృష్ణలీలలు ప్రాకృతికబుద్ధి ఉన్నవాడికి అర్థంకావు. కృష్ణుడు అక్కడ అలా చేసాడు, ఇక్కడ ఇలా చేసాడు అనుకొంటాముకదా, అసలు ప్రకృతికి సంబంధించిన వాసనగానీ, పాపంగానీ, దోషంగాని పరమాత్మలో లేవు, ఉన్నట్లు మన బుద్ధికి అనిపిస్తుంది దానికి కారణం మనకు భక్తి లేదు, ప్రేమ లేదు, వివేకం లేదు, క్రమశిక్షణ లేదు. మనం జీవితాన్ని జాగ్రత్తగా నియమించుకొంటే, మనది క్రమశిక్షణతో కూడిన జీవితం అయితే ఈశ్వరసాక్షాత్కారం దానంతట అదే కలుగుతుంది.

మనకు భాగవతంలో రెండు కథలు ముఖ్యం. 1. ధృవుడు, 2. ప్రహ్లాదుడు. భక్తులందరిలోకి అగ్రస్థానం ప్రహ్లాదుడికి ఇచ్చారు. ధృవుడికి నారదుడు వాసుదేవ మంత్రం ఉపదేశించాడు. వాసుదేవ మంత్రం స్మరించుకొంటూ నిద్ర లేదు, ఆహారం లేదు అలా ఉండిపోయాడు ధృవుడు. అప్పుడు మహావిష్ణువు వచ్చి దర్శనమిస్తాడు, ధృవుడు ఆయన వంక చూడడు. ఎవరిని తెలుసుకోవటం కోసం నీవు ధ్యానం చేస్తున్నావో వాడిని నేనేనయ్యా అంటాడు మహావిష్ణువు. అప్పుడు ధృవుడు కళ్ళు తెరుస్తాడు. భౌతికమైన నేత్రాలతో పరమాత్మను దర్శించాడు. మహాత్ములకు, మహర్షులకు లేనటువంటి వైభవం అది. అప్పటికి కోరికలు లేని స్థితికి వచ్చేస్తాడు ధృవుడు. ఏదైనా కోరుకో నాయనా అంటే, నాకు ఒక్కటే కోరిక ఉంది ఎప్పుడూ నీ పాదాలయందు భక్తి నిలబడి ఉండేలా చూడు, అంతకంటే ఇంకొక కోరిక ఏమి లేదు అంటాడు. కొంతమంది భక్తులు ముక్తికంటే భక్తికి అగ్రస్థానం ఇస్తారు. వాళ్ళకు ఎంజాయ్ చేయటానికి బాహ్యమైన వస్తుజాలం అక్కరలేదు, వారిని వారే ఎంజాయ్ చేస్తూ ఉంటారు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడితో అంటాడు నారాయణ, నారాయణ అంటావు ఏమిటి, ఎవరిని చూసుకొని ఈ పొగరుబోతు మాటలు మాట్లాడుతున్నావు అంటే నీకు ఆధారం, నాకు ఆధారం, మొత్తం సృష్టికి ఆధారమైన నారాయణుడి సపోర్టు చూసుకొనే మాట్లాడుతున్నాను అంటాడు ప్రహ్లాదుడు. నేను చెప్పిన నారాయణుడు ఇందుగలడు, అందులేడు అనికాదు, అంతటా ఉన్నాడు అని చెపుతాడు. అంతటా ఉంటే ఈ స్థంబంలో కూడా ఉన్నాడా అని హిరణ్యకశిపుడు అడుగుతాడు. అంతటా ఉన్నవాడు ఈ స్థంబంలో లేకుండా ఎలా ఉంటాడు అన్నాడు ప్రహ్లాదుడు. అప్పుడు హిరణ్యకశిపుడు గదతో ఆ స్థంబాన్ని మోదుతాడు, ఆ స్థంబంలో నుండి భయంకరమైన శబ్ధంతో నరసింహస్వామి అవతారం వచ్చింది. ఒక్క ప్రహ్లాదుడిని రక్షించటానికే స్వామి ఆ అవతారంలో వచ్చాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-09-2007, అయిభీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాధ, కృష్ణుడు మనకు వేరుగా కనిపిస్తున్నారు కాని కృష్ణుడే రాధ రూపంలో వచ్చాడు. రాధ వేరు, కృష్ణుడు వేరు కాదు. భగవంతుడిని ఎలా ప్రేమిస్తే, భగవంతునియందు మన మనస్సు, బుద్ధి ఈ రెండింటిని ఎలా నిలబెడితే ఆయన అనుగ్రహాన్ని మనం సంపాదించగలమో కృష్ణుడే రాధరూపంలో వచ్చి మనకు చేసి చూపించాడు. కాని మనం ఏమనుకొంటున్నాము అంటే రాధ కృష్ణుడి యొక్క భక్తురాలు, ప్రేమికురాలు అని అనుకొంటాము, రాధ కృష్ణుడి కంటే భిన్నం కాదు. భగవంతుడిని ఎలా ఆరాధిస్తే ఆయనను పొందగలమో కృష్ణుడే రాధ రూపంలో వచ్చి మనకు చూపించాడు. రాధ సాధన, కృష్ణుడు సాధ్యం. మనం సాధన చేసి కృష్ణుడిని ఎలా పొందాలో రాధ రూపంలో చూపించాడు. వేదంలో కర్మకాండ గురించి ఎక్కువ చెప్పారు, ఉపనిషత్‌లలో జ్ఞానం గురించి ఎక్కువ చెప్పారు. వీటి అన్నింటిని సమన్వయం చేసి పరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. అహంకారం లేకుండా మనిషి ఉండడు. అందుచేత మనిషి చెప్పేమాట ప్రమాణం కాదు. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని నడుచుకొంటే నన్ను పొందుతావు అంటే మోక్షాన్ని పొందుతావు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనుషుల ప్రేమ నమ్మటానికి వీలులేదు. వాతావరణం ఎటువంటిదో మనుషుల ప్రేమ అటువంటిది అని శాస్త్రంలో చెప్పారు. వాతావరణం ఇప్పుడు ఒకలాగ ఉంటుంది, ఇంకో గంటలో ఎలా ఉంటుందో చెప్పలేము. భగవంతుని ప్రేమలో చపలత్వం ఉండదు, మనిషి ప్రేమలో చపలత్వం ఉంటుంది. ఒక్క భగవంతుడి ప్రేమే మనం నమ్మదగినది. మనకు తల్లీ, తండ్రీ, స్నేహితుడు, సాధన, మోక్షం సమస్తము ఆయనే. అయితే మనకు భగవంతుని యందు గౌరవం లేదు. ఇంట్లో చాకిరి చేయలేకపోతున్నాము అని చాలామంది అంటారు, సమాజంలో ఎవరికైనా కొద్దిగా ఉపకారం చేస్తే ఈ సమాజాన్ని మేమే ఉద్ధరిస్తున్నాము, ఈ దేశాన్ని మేమే ఉద్ధరిస్తున్నాము అని చెప్పకొంటారు. భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నిజమైన భక్తుడు, కర్మయోగి డాంబికం కోసం పనిచెయ్యడు. కొంతమంది ధర్మాన్ని ఆచరిస్తారు కాని డాంబికం కోసం, ఇతరులు గొప్పగాచెప్పకోవాలి అని ఆచరిస్తారు. వాళ్ళకి ఈ లోకంలో గౌరవం వస్తుంది కాని మరణానంతర జీవితం సున్న. చాలామంది లౌకికులు డాంబికం కోసం పనులు చేస్తారు, ధర్మం మనలను ఉద్ధరిస్తుందని, ధర్మంయందు గౌరవం ఉండి ధర్మాన్ని ఆచరించటం లేదు, గొప్పలకోసం ఆచరిస్తారు. నిజమైన

భక్తుడు ఇతరులపట్ల ఉన్న ప్రేమను పని రూపంలో చూపిస్తాడు అని పరమాత్మ చెప్పాడు. తోటి మానవుల పట్ల, సమాజంపట్ల ఉన్న ప్రేమను ఏవో బజారు మాటలతో కాకుండా వారి కోసం పనిచేసి ఎవడైతే చూపిస్తున్నాడో, అది నిజమైన పని, వాడు నిజమైన భక్తుడు. ఆ పని వలన జీవుడు పవిత్రుడవుతాడు, వాడు తరిస్తాడు. నువ్వు ఏది చేసినా, ఎవరికి చేసినా నీకు ఉన్న ప్రేమను పనిరూపంలో ఎవడైతే చూపిస్తున్నాడో, వాడు కర్మయోగి, వాడు శరీరాన్ని విడిచిపెట్టిన వెంటనే నన్ను పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు, దానిని క్రమముక్తి అంటారు. పని కూడా ప్రేమే. ప్రేమను పని రూపంలో ఎవడైతే చూపిస్తున్నాడో వాడు యోగి. అంటేవాడు కర్మను ఖర్మ అన్నట్లు కాకుండా యోగంగా చేస్తున్నాడు, వాడు తరిస్తాడు. కృష్ణుడు సర్వదేవతల స్వరూపం. అచ్యుతం, అనంతం, గోవిందం, కేశవం, జగన్నాథం, రామం, నారాయణం. అంటే ఆ కేశవుడికి పెట్టే నమస్కారం అందరి దేవతలకు అందుతుంది. అహంకారం ఉన్న మనిషి ఎలా ఉంటాడు అంటే మన కుటుంబ సభ్యులు, మన గ్రామంలో ఉన్న జనం, దేశంలో ఉన్న జనం అంతా నాచేతిలో ఉండాలి, నామాట వినాలి అనుకొంటాడు, వాడే అహంకారి, వాడే రాక్షసుడు.

కృష్ణుడిని తీసుకొనిరమ్మని కంసుడు అక్రూరుడిని పంపుతాడు. కబురు ఎప్పుడు వస్తుందా అని బలరాముడు, కృష్ణుడు కనిపెట్టుకొని ఉన్నారు. బృందావనం విడిచిపెట్టి వెళ్ళవద్దని గోపికలు అంటారు. చిరిగిపోయిన బట్టలను మనిషి ఎలా విడిచిపెట్టేస్తాడో అలాగ మమ్మల్ని విడిచిపెట్టి నువ్వు వెళ్ళిపోతున్నావు కృష్ణా అంటుంది రాధ. గోపికల ప్రేమ మనకు అర్థం కాదు. గోపికల ప్రేమలో కోరికలు లేవు. మన ప్రేమలో కోరికలు ఉంటాయి. మనం గుడికి వెళితే, తిరుపతి వెళితే, కాశీ వెళితే, అరుణాచలం వెళ్ళి గిరిప్రదక్షిణ చేస్తే ఏమీ కోరుకోకుండా రాము. మనం శుభ్రంగా పాడైపోయి ఉన్నాము. అలాగని ఒక ప్రక్కన పడి ఉంటే పరవాలేదు, గోపికలను విమర్శిస్తున్నాము. గోపికలు పరమపవిత్రులు, కోరిక ఎలా ఉంటుందో వారికి తెలియదు. బుద్ధిలేని మనం బుద్ధి ఉన్నవారిని విమర్శించటం. ఇక్కడ ఇంతమంది ఉన్నారు. ఏ రకమైన కోరిక లేకుండా భగవంతుడిని భగవంతుడి కోసమే అర్చన చేసేవారు, ఆయనను ధ్యానించేవారు మీలో ఒక్కరు ఉన్నారేమో చెప్పండి, మీరు గోపికలను విమర్శించటం ఏమిటి? వారు మహర్షులు, యోగులు. మనం పుట్టినప్పుడు గుణాలతో పుడతాము, మాయతో పుడతాము. నూటికి నూరుపాళ్ళు మాయలో ఉంటాము, మాయలోనే చనిపోతాము. భగవంతుడు పుట్టినప్పుడు పుట్టుక అనరు, అవతారం అంటారు.

ఆయన ఎందుకు పుడుతున్నాడు అంటే దుష్టశిక్షణ కోసం, శిష్టరక్షణ కోసం ఆయన అవతరిస్తాడు. మానవజాతిపట్ల ప్రేమ వలన పుట్టటంకాని, పని ఉండి పుట్టటం కాదు. కృష్ణుడు చేసే ప్రతీపని ప్రేమే, శాంతే, ఆనందమే, వైభవమే. కృష్ణుడు బృందావనంలో ఉన్నాడు అనుకొంటున్నారు, ఆ కృష్ణుడు ఇక్కడ ఉన్నాడు, మన హృదయంలో అంతర్యామిగా కూడా ఉన్నాడు. మనకు సాధనాబలం లేదు అందుచేత ఆయన మనకు వ్యక్తం కావటంలేదు. మనం నూటికి నూరుపాళ్ళు లౌకికులం, లోకం వాసన లేకుండా ఎవరు ఉన్నారు? ధర్మాన్ని ఆచరించటం కూడా డాంబికం కోసం చేస్తూ ఉంటే అది లౌకికత్వమే. భగవంతుడు పూర్ణకాముడు. సంవత్సరానికి ఎన్ని పూర్ణిమలు వస్తాయో అన్ని పూర్ణిమలు ఒక్కరోజున వచ్చేస్తే ఆ పూర్ణిమ ఎంత అందంగా ఉంటుందో, ఎంత బలంగా ఉంటుందో కృష్ణుడి అవతారం అటువంటిది. మనం గుణాలతో పుడతాము, ఆయన గుణాలు లేకుండా పుడతాడు. ఆయన చేసేపని ఆయనను బంధించదు, మనం చేసే పని మనలను బంధిస్తుంది. మనం కోరికతో పనిచేస్తాము, పనికి ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని అనుభవించాలి అనుకొంటాము, అనుభవించటానికి శరీరం కావాలి. శరీరం వస్తే దుఃఖం రాకుండా ఎవడూ ఆపలేడు. మనం పనిచేస్తాము కాని స్వార్థాన్ని నెరవేర్చుకోవటానికి చేస్తాము. భక్తులు, యోగులు వారి ప్రేమను పనిరూపంలో చూపిస్తారు. భగవంతుడి యొక్క జన్మ రహస్యం అంటే పుట్టినా పుట్టని వానితో సమానము. ఆయన కర్మ రహస్యం అంటే ఏ పని చేసినా చెయ్యనివాడితో సమానము. ఆయన అలౌకికుడు. ఆయన జన్మ అలౌకికం, ఆయన చేసేపని అలౌకికం. ఇది బాగా అర్థం చేసుకొన్నవాడు జన్మరాహిత్యాన్ని పొందుతాడు.

భగవంతుడి నామాన్ని శ్రద్ధగా చేస్తూ ఉంటే వాడి శరీరం పవిత్రం అవుతుంది, మనస్సు పవిత్రం అవుతుంది, బుద్ధి బాగుపడుతుంది. పరమపవిత్రులు కానివారు ఈశ్వరునిలో ఐక్యం పొందలేరు. మనకు ఎంతోకొంత భక్తి ఉన్నమాట నిజమే కాని మనకు ప్రాపంచిక జ్వరం ఎక్కువగా ఉంది. మనకు దేవుడికి సంబంధించిన పిచ్చిలేదు గాని ప్రాపంచిక పిచ్చి నూటికి నూరుపాళ్ళు ఉంది. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు మనకు అర్థం కావు. ఆయన చెప్పిన మాటలు మన మనస్సుకు అందదు. మనం ఎక్కడ పాడైపోతున్నాము అంటే భగవంతుడు ఈ మాట చెప్పాడు, అయ్యో ఈ మాట మనకు అర్థం కావటం లేదు, దానిని అర్థం చేసుకొనే పుణ్యబలం మనకు లేదు, ఆ బుద్ధిసూక్ష్మత మనకు లేదు, ఆ ఏకాగ్రత మనకు లేదు అని అనుకోవటం మానివేసి, ఈ మాటలు అన్నీ వ్యర్థం, దీని వలన టైము వేస్టు

అనుకొంటున్నాము. భగవంతుడు అందరిలోను అంతర్యామిగా ఉన్నాడు. నీ ప్రాణానికి ప్రాణాన్ని నేను, నీ కర్మ సాక్షిని నేను అని భగవంతుడు చెప్పాడు. నీకు ఏ తలంపు వచ్చినా అది ప్రక్కవాళ్ళకు తెలియదు కాని భగవంతుడికి వెంటనే తెలుస్తుంది. ఎందుచేతనంటే మీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మన దృష్టిలో పెద్దపని, చిన్నపని అని ఉంటుంది గాని ప్రేమ ఉన్నవాడికి అన్ని పనులు సమానమే. మనం చేసే పనులు భగవంతుడు చూడడు, ఆ పని చేసేటప్పుడు మన లోపల భావన చూస్తాడు. చిత్తశుద్ధి లేకుండా మోక్షం రాదు అని పరమాత్మ చెప్పాడు. మీరు ఏ యోగం అవలంభించినా చిత్తశుద్ధిని పొందాలి. రాధ నన్ను ఎలా ప్రేమించిందో అలాగ ప్రేమించటం వలన ఇమీడియట్‌గా విమాన ప్రయాణం కంటే వేగంగా నీకు చిత్తశుద్ధి కలుగుతుంది అని పరమాత్మ చెప్పాడు. పనిని చాకిరీగా చేసిన వాడికి దాని తాలుక ఫలితం చుట్టుకొంటుంది, పనిని ప్రేమగా చేసినవాడు యోగి అవుతాడు.

గృహస్థులకు మోక్షం వస్తుందా లేక వారు సన్యాసం తీసుకోవాలా అని భగవాన్‌ను అడుగుతున్నారు. గృహస్థాశ్రమంలో ఉన్నవాడు నేను గృహస్థుడను, ఈ సంసారయాత్ర మోయలేకపోతున్నాను అంటాడు. ఎర్రబట్టలు వేసుకొన్నవాడు నేను సన్యాసిని, నేను స్వాముల వారిని నాకు పాదపూజలు ఎవడు చేస్తాడు అని కనిపెట్టుకొని ఉంటున్నాడు, బ్రహ్మచర్యం అవలంభించినవాడు నేను బ్రహ్మచారిని, నేను బ్రహ్మచారిని అంటాడు. అంటే గృహస్థుడికి నేను ఉంది, సన్యాసికి నేను ఉంది, బ్రహ్మచారికి నేను ఉంది, ఆ నేనులో నుండి ఎవడూ బయటకు రాలేదు. అందుచేత ముగ్గురికి మోక్షం లేదు. పోగొట్టుకోవలసింది ఏదో దానిని పోగొట్టుకోవాలి. మీరు సన్యాసి అయినా, గృహస్థు అయినా లోపల అజ్ఞానం పోవాలి. ఆత్మజ్ఞానం కలిగేవరకూ అజ్ఞానం నశించదు. మనం పని మొదలుపెడితే మన అహంకారం అంతా కర్తృత్వం కింద మారిపోతుంది. భగవంతుడికి అహంకారం లేదు కాబట్టి కర్తృత్వం లేదు. కర్తలేని కర్మ చేసేవాడు మూడు లోకాలను భస్మం చేసినా వాడికి పాపంలేదు. ఆడించేవాడు భగవంతుడు, మనం ఆడే బొమ్మలం. ఎవడు ఏ పని చేస్తున్నా ఆడించేవాడు ఆయనే అని మర్చిపోవటం వలన ఇలా సంసారంలో పడి ఉన్నాము. ఈ శరీరం అనే బొమ్మలు ఆయన ఎలా ఆడమంటే అలా ఆడతాయి. ఎవరిమటుకు వాళ్ళు నేను ఆడుతున్నాను, నేను ఆడుతున్నాను అంటే ఇంతమంది ఉన్నారా? లేరు. ఆడించేవాడు ఆయన ఒక్కడే భగవంతుడి యొక్క అనుగ్రహం వలన కాని ఈ విషయం మనకు అర్థం కాదు. మహాత్ములను, సత్పురుషులను మనకు చేతనైతే గౌరవించాలి కాని వారిని అగౌరవపరచకూడదు. వారిని

అగౌరవపరిస్తే దానికి రెట్టింపు మనం అనుభవించవలసి ఉంటుంది. ఒకోసారి సంపదలు ఎక్కువ అవ్వటం వలన కూడా మనం పాడైపోతాము. సంపదను మనం నిగ్రహించుకొంటే ఫరవాలేదు, నిగ్రహించుకోలేకపోతే చెడ్డఅలవాట్లలోనికి పోతాము. మనకు ప్లస్ పాయింట్లు వచ్చినప్పుడు నిగ్రహించుకోకపోతే ప్రమాదంలో పడతాము. కొంతమందికి భగవంతుడే సంపద, ఏమీలేని వారు మాకు ఏమీ లేదు అనుకోనక్కరలేదు, వారికి భగవంతుడే సంపద. కొంతమందికి దుఃఖం వచ్చినా దానిని మంచిగా మలచుకొంటారు. చనిపోయినవారిని, ముసలివారిని చూసి బుద్ధుడికి వైరాగ్యం వచ్చి గౌతమబుద్ధుడు అయ్యాడు, అర్జునుడికి దుఃఖం లేకపోతే భగవద్గీత లేదు.

ఈశ్వరసంకల్పం ప్రకారం ఈ సృష్టి నడుస్తోంది. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు అయితే నీకు శరణాగతి లేదు. ఎవరు ఎప్పుడు చనిపోవాలో అప్పుడు చనిపోతారు. నువ్వు తెలుసుకోవలసినవాడు ఎక్కడో దూరాన లేడు, నీ హృదయంలోనే ఉన్నాడు. వాడిని తెలుసుకొంటే నీ జన్మ సఫలం అవుతుంది. నీవు అన్నివిధాలుగా ప్రయత్నం చేసి, నీకు ఉన్న అన్ని అవకాశములను ఉపయోగించుకొని నీ లోపలఉన్న ఈశ్వరుడికి శరణాగతి చెంది ఆయనను తెలుసుకోవయ్యా అంటున్నాడు పరమాత్మ, మన హృదయంలో ఉన్న నిజమైన నేను మనకు తెలియటం లేదు కాబట్టి ఈ మనస్సే నేను అనుకొంటున్నాము, అక్కడ నుండి విషాదం ప్రారంభమవుతోంది. మనస్సే నిజం అనుకోవటం వలన నిజమైన నేను కోసం మనం ప్రయత్నం చేయటం లేదు. ఈ సృష్టినంతా ఆడించేవాడిని కాదని నీవు ఒక్క పని చేయగలవా? నువ్వు స్వతంత్రుడివా చెయ్యటానికి? భగవంతుడి సంకల్పం ప్రకారం యాక్టు చేయటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము, అంతా ఆయనే, జరిగేది ఈశ్వరసంకల్పమే. మన హృదయంలో నారాయణుడు ఉన్నాడు, ఆయన మనకు అనుభవంలోనికి రాకుండా మనలోని వాసనలు, సంస్కారాలు అడ్డువస్తున్నాయి. విశ్వరూపదర్శనం అప్పుడు ఈ భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, మొత్తం సృష్టి అంతా ధరించింది నేనే, నేనే ఇలా కనిపిస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. ఇది అంతా అబద్ధం అని మనం అనుకొంటాము. దానికి మనలో ఉన్న పాపం కారణం. విశ్వాన్ని విశ్వేశ్వరుడిగా మనం చూడలేకపోతున్నాము. విష్ణుసహస్రనామాలలో మొదటిది విశ్వం. నిరంతరం నన్ను స్మరించటం వలన నిన్ను పాపరహితుడ్ని చేస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. మన మనస్సు ఈగలాంటిది. ఈగలు చూడండి కొద్దిసేపు మిఠాయి మీద వాలుతాయి, తరువాత

ప్రక్కనే ఉన్న మలంమీద వాలుతాయి. మన మనస్సు కూడా అంతే కొద్దిసేపు రామ, రామ అంటుంది. మరల ప్రకృతి విషయాల మీద వాలుతూ ఉంటుంది. అలా నీ మనస్సు రకరకాలుగా వాలకుండా అనన్యచింతనతో నిరంతరం నన్నే స్మరిస్తూ ఉంటే నువ్వు తరిస్తావు అని పరమాత్మ చెపుతున్నాడు. మనం కూడా అప్పడప్పడు దేవుడిని తలపెట్టుకొంటాము. ఏవో మోకాళ్ల నొప్పలు వచ్చినప్పడో, ఇంట్లో పెళ్లిళ్ళు ఆలస్యం అయినప్పడో, రోగాలు వచ్చినప్పడో, ఏవైనా కష్టాలు వచ్చినప్పడో భగవంతుడిని స్మరిస్తాము. మనది కారణభక్తి. కారణభక్తి వలన మనకు భగవంతుడు లభ్యంకాడు, మీ కోరికలు నెరవేరవచ్చు. అకారణ భక్తి ఉంటే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. భక్తివలన, ప్రేమ వలన భగవంతుడు స్వాధీనమవుతాడు.

మోక్షంకోసం మనం చేసే ప్రయాణంలో వచ్చే అవరోధాలను మనం తొలగించుకోలేము. మనం పనిచేస్తూ ఉండాలి, ఆయన అనుగ్రహం రావాలి. ఆయన అనుగ్రహం వలన కాని మనకు ఉన్న అలవాట్లలోనుండి, బలహీనతలలోనుండి మనం బయటకు రాలేము. మనం చేసే ప్రయత్నాలద్వారా మనస్సును పెంచుకొంటున్నాము. మనోనాశనం అయితేగాని పరమాత్మ మనకు లభ్యంకాడు. కృషి ఒక్కటే సరిపోదు, పరమాత్మ అనుగ్రహం ఉండాలి. పరమాత్మ అనుగ్రహం లేకుండా కేవలం మన తెలివితేటల వలన ఒడ్డుకు రాలేము. అనన్యచింతనవలన నీలో ఉన్న దోషాలు అన్నీ రాలిపోతాయి. నీ బుద్ధి పవిత్రమవుతుంది, మనస్సు నిర్మలమవుతుంది. వసుదేవుడి బుద్ధి పవిత్రమైనది, దేవకి మనస్సు నిర్మలమైనది. ఎక్కడైతే బుద్ధి పవిత్రంగా ఉందో, మనస్సు నిర్మలంగా ఉందో అక్కడ భగవంతుడు అవతరించాడు. నీవు ఎర్రబట్టలు కట్టుకొన్నావా, నీవు గృహస్థుడవా, నీవు బ్రహ్మచారివా అనేది ముఖ్యంకాదు, నీవు ఇంటి దగ్గర ఉన్నా మనోనాశనం అవుతోందా అనేది ముఖ్యం. నీ మనస్సు చిరిగిపోయిందా లేదా అనేది ముఖ్యం. బట్టలు చిరిగిపోయినంత తొందరగా మనస్సు చిరగదు. ఎందుచేతనంటే వేలాదిజన్మల నుండి పోగుచేసుకొన్న అలవాట్లు, వాసనలు అన్నీ మనస్సులో ఉంటాయి. వాడు ఏమతస్థుడైనాగాని మనోనాశనం అవ్వకుండా ఎవడికీ మోక్షం రాదు. అన్ని శరీరాలు ఒకే పనిచెయ్యవు. మనం రకరకాల పనులు చేస్తున్నాము. ఇది నేను చేస్తున్నాను అనే భావనను ప్రక్కనపెట్టి మీ పని మీరు చేసుకోండి. అప్పడు మనస్సు తొందరగా చిరిగిపోతుంది. ఎప్పడైతే నీ మనస్సు చిరిగిపోయిందో లోపల ఉన్న పరమాత్మ నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు, అదే నీ కడసారి జన్మ, ఇంక శవాలను మోయవలసిన పని లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| అక్టోబర్ | 18 | శృంగవృక్షం, కనకదుర్గ గుడి వద్ద |
| అక్టోబర్ | 20 | బూరుగుపల్లి, వయా దొడ్డిపట్ల |
| అక్టోబర్ | 21 | నరసాపురం, వై.ఎన్. కళాశాల ఆడిటోరియం |
| నవంబర్ | 01 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**ది॥ 28-08-2007న గణపవరంలోని**
**శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల**
**సందర్భముగా ప॥గో॥ జిల్లా కలెక్టర్**
**శ్రీమతి జి. జయలక్ష్మిగారిని సత్కరిస్తున్న**
**సద్గురు శ్రీ నాన్నగారు**



ది॥ 28-08-2007న గణపవరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల
సందర్భముగా నటరాజ విగ్రహాన్ని ఆవిష్కరించిన సద్గురు శ్రీ నాన్నగారు



ది॥ 28-08-2007న గణపవరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం స్వర్ణోత్సవముల
సందర్భముగా సంఘ సభ్యులకు స్వర్ణోత్సవ జ్ఞాపికలను బహూకరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు